నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | KAMAREDDY

- తొలి పూజలందుకోనున్న ఏకదంతుడు
- పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన
- మట్టి వినాయకులకే జైకొడుతున్న జనం

**అతిపెద్ద ఆధ్యాత్మిక** వేడుక గణేశ్ నవరాత్రోత్సవాలకు సర్వం సిద్ధమైంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకకు ఉమ్మడి జిల్లా ముస్తాబైంది. ఊరూవాడా కొలువుదీరనున్న బొజ్జ గణపయ్య.. భారీ సెట్టింగులతో కనువిందు చేసే మండపాలు.. దైవత్వం నిండిన వినాయక చవితి అంటేనే అదో సంబురం. భక్తిశ్రద్ధలతో సాగే నవరాత్రోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వినాయక విగ్రహాల తరలింపు, పూజాసామగ్రి కొనుగోళ్లతో ఒకరోజు ముందే పండుగ సందడి నెలకొంది.

–కామారెడ్డి/సుభాష్‌నగర్, సెప్టెంబర్ 6

# మట్టిని ప్రేమిద్దాం గణపయ్యను పూజిద్దాం



నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి వాహనంపై వినాయక విగ్రహాన్ని మండపానికి తరలిస్తున్న గ్రామస్తులు



గాంధీచౌక్‌లో కొనుగోలుదారుల సందడి..

### మార్కెట్లకు పండుగ కళ

వినాయక చవితి సందర్భంగా మార్కెట్లు శుక్రవారం కళకళలాడాయి. వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు, పూజాసామగ్రి తదితర వస్తువుల కొనుగోళ్లతో సందడి నెలకొంది. పూజకోసం వినియోగించే 21 రకాల పత్రి, చామంతి, బంతి పూలు, మామిడిఆకులు, మారేడికాయల అమ్మకాలు జోరుగా సాగాయి.



కామారెడ్డిలో మట్టి వినాయక ప్రతిమల విక్రయం

**వినాయక చవితి** అంటేనే అందరిలో అదో ఉత్సాహం. ఊరూవాడ కనిపించే సరికొత్త సంబురం. ఆకర్షణీయమైన మండపాలు.. అందులో కొలువుదీరే భారీ విగ్రహాలు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు పూజలు, భజనలతో తొమ్మిది రోజుల పాటు సందడి కనిపిస్తుంది. శనివారం కొలువుదీరనున్న వినాయకుడి కోసం ఇప్పటికే మండపాలు ముస్తాబయ్యాయి. పట్టణాల్లోనే కాదు పల్లెల్లోనూ భారీ సెట్టింగులు కనిపిస్తున్నాయి.


### మట్టి వినాయకులకు డిమాండ్

నేడు (శనివారం) వినాయక చవితి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వేలాది మండపాల్లో ఏకదంతుడిని ప్రతిష్ఠించనున్నారు. పార్వతీతనయుడి రాక కోసం ఒక్క కామారెడ్డి జిల్లాలోనే 3 వేలకు పైగా మండపాలు సిద్ధమయ్యాయి. నిజామాబాద్‌లో ఆ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. విభిన్న ఆకృతుల్లో ముస్తాబైన గణపయ్యను మండపాలకు తరలించే ప్రక్రియ రెండ్రోజుల నుంచి కొనసాగుతున్నది. శుక్రవారం కూడా ఆ సందడి కనిపించింది. మట్టి గణపయ్యలను కొనుగోలు చేసే వారి సంఖ్య ఈసారి కూడా బాగానే పెరిగింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారయ్యే విగ్రహాలు పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన నేపథ్యంలో ప్రజలు మట్టి గణపయ్యలకే జైకొడుతున్నారు. మరోవైపు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు సైతం ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాయి. అయితే, భారీ సెట్టింగులతో వేసే మండపాల్లో మాత్రం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారుచేసిన వినాయకులను ప్రతిష్ఠించనున్నారు.

# అమాత్య యోగం ఎవరికి దక్కేనో!

## ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవిపై పీటముడి

- ఒక్కఛాన్స్ కోసం ఎమ్మెల్యేల పట్టు
- ఆశల పల్లకిలో కొత్త శాసనసభ్యులు
- సుదర్శన్ రెడ్డికి పోటీగా బరిలోకి..
- కొన్నాళ్లుగా క్యాబినెట్ కూర్పుపై నెలకొన్న సందిగ్ధత
- గందరగోళంలో హస్తం పార్టీ శ్రేణులు
- సీనియర్ వర్సెస్ జూనియర్స్‌గా మారిన సీన్



నిజామాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపై కొన్నాళ్లుగా స్తబ్దత నెలకొన్నది. మంత్రివర్గ కూర్పుపై రోజుకో వివాదం తెరపైకి వస్తోంది. మంత్రి వర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటి వరకు ప్రాతినిధ్యం లేకపోవడంతో త్వరలో చేపట్టనున్న 'విస్తరణ'లో ఒకరికి చోటు దక్కనున్నది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు కేటాయించబోయే అమాత్యుడి పోటీలో పాత, కొత్త ఎమ్మెల్యేలు బరిలో ఉన్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మొత్తం 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇందులో సీనియర్ ఎమ్మెల్యే అయిన సుదర్శన్ రెడ్డికి గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. ఎనిమిది దశాబ్దాల వయసులో ఇవే చివరి ఎన్నికలంటూ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తనకే మంత్రి పదవి దక్కుతుందని ధీమాగా ఉన్నారు. అధిష్టానం కూడా తనవైపే మొగ్గు చూపుతుందని భావిస్తుండగా.. మంత్రివర్గ విస్తరణపై సందిగ్ధత నెలకొన్నది. దీనిపై ఆ పార్టీ సీనియర్ నాయకులను ప్రశ్నిస్తే అంతా గందరగోళం, అయోమయం నెలకొన్నదని బదులివ్వడం గమనార్హం. మంత్రివర్గ కూర్పులో ఉమ్మడి జిల్లా నుంచి ఒక ఎమ్మెల్యేకు అవకాశం దక్కడం ఖాయం కావడంతో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారు కూడా జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. తాజా పరిణామాలతో కాంగ్రెస్ పార్టీలో సీనియర్ వర్సెస్ జూనియర్స్ అన్నట్లుగా రాజకీయం రసవత్తరంగా మారింది.

### చివరి ఎన్నికలంటూ..

ఇవే తనకు చివరి ఎన్నికలంటూ 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. క్యాడర్ కోరిక, ప్రజల విన్నపాల మేరకు బరిలో నిలిచి కేవలం మూడున్నర వేల ఓట్లతో విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న సుదర్శన్‌రెడ్డికే మంత్రి పదవి దక్కడం ఖాయమని అంతా భావించారు. డిసెంబర్ 7న కొలువుదీరిన రేవంత్ రెడ్డి టీమ్‌లో ఉమ్మడి జిల్లాకే చోటు దక్కలేదు. తొమ్మిది నెలలవుతున్నా మంత్రి వర్గ కూర్పు జరగడం లేదు. సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో త్వరలోనే మంత్రివర్గ కూర్పు ఉంటుందని అంతా భావిస్తున్నారు. ఆ యోగం ఎవరికి వరిస్తుందో? అన్న చర్చ జోరుగా జరుగుతోంది. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. బంధుత్వం కూడా ఉండడంతోపాటు ఆది నుంచి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో మద్దతు ఇచ్చిన వారిలో సుదర్శన్ రెడ్డి కూడా ఒకరు. కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలు, ప్రజా జీవితంలో అనుభవం దృష్ట్యా మంత్రి పదవి తనదేనన్న పట్టుదలతో సుదర్శన్ రెడ్డి ఉన్నారు. హోం మంత్రిగా కీలక శాఖను కూడా సుదర్శన్‌రెడ్డికే కేటాయించే అవకాశం ఉందని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన షబ్బీర్ అలీకి సలహాదారు పోస్టుతో సరిపెట్టగా.. సుదర్శన్ రెడ్డికి అంతగా పోటీ లేకుండా పోయింది. కానీ జూనియర్ ఎమ్మెల్యే ధాటిని తట్టుకుని నిలబడగలడా ? అన్నది తేలాల్సి ఉన్నది

### ఆశల పల్లకిలో కొత్త ఎమ్మెల్యేలు..

వైద్య రంగం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డికి ఎమ్మెల్సీగా అనుభవం ఉన్నది. దీంతో ఆయన తనకే మంత్రి పదవి ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఇందుకోసం జోరుగా ప్రయత్నాలు చేస్తున్నట్లుగా పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నుంచి గెలిచిన లక్ష్మీకాంతారావు సైతం తొలిసారి ఎమ్మెల్యే అయినప్పటికీ దళిత సామాజిక వర్గం కోటాలో పదవి ఇవ్వాలని కోరుతున్నట్లుగా సమాచారం. ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల కాలం నుంచి దళిత సామాజిక వర్గానికి పదవులే లేకపోవడంతో ఈ అంశాన్ని తెరమీదికి తీసుకువచ్చి, మంత్రి పదవి కోసం పట్టుబడుతున్నట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఎల్లారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మదన్ మోహన్ రావు సైతం ఏఐసీసీ ద్వారా మంత్రి పదవి కోసం జోరుగా పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తోంది. ఏఐసీసీ ఐటీ వింగ్‌కు సేవలు అందించిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఢిల్లీ పెద్దలతోనే నేరుగా సంప్రదింపులు చేస్తున్నట్లుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇలా డాక్టర్ భూపతి రెడ్డి, లక్ష్మీకాంతారావు, మదన్ మోహన్ రావు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ మంత్రి పదవి కోసం బరిలో ఉండడంతో మంత్రివర్గ విస్తరణలో జాప్యం నెలకొన్నట్లు పార్టీ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

# గురుకులంలో విద్యార్థుల వీరంగం

- ఇనుప రాడ్లు, బ్యాట్లతో కొట్టుకున్న వైనం
- ఎల్లారెడ్డి సోషల్ వెల్ఫేర్ కాలేజీలో ఘటన

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 6: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో గురువారం రాత్రి తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది. రెండు వర్గాలుగా విడిపోయిన విద్యార్థులు ఇనుప పైపులు, క్రికెట్ బ్యాట్లతో కొట్టుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిసింది. విద్యార్థుల ఘర్షణపై సమాచారం అందుకున్న ఆర్డీవో ప్రభాకర్ శుక్రవారం కళాశాలకు వచ్చి ఏం జరిగిందో తెలుసుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గురుకుల కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఓ విద్యార్థి చెడు వ్యసనాలకు లోనయ్యాడు. తన మిత్ర బృందంతో కలిసి అధ్యాపకుల కండ్లు గప్పి కళాశాల ఆవరణలోనే బీరు, సిగరేట్ తాగడం వంటివి చేసేవాడు. ఇది గమనించిన తోటి విద్యార్థి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా, పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం మరోసారి బీర్లు, సిగరెట్లు తాగగా ఆ విద్యార్థి రెండోసారి ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేయగా, ఆయన సదరు విద్యార్థులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే, ఫిర్యాదు చేసిన విద్యార్థిపై ఆగ్రహం పెంచుకున్న సదరు బ్యాచ్ సమయం కోసం వేచిచూసింది. హిందీ అధ్యాపకుడు పండిత్ గురువారం రాత్రి గంట సేపు మాత్రమే డ్యూటీలో ఉండి ఇంటికి వెళ్లిపోయాడు. ఇదే అదనుగా సదరు విద్యార్థుల బృందం అర్ధరాత్రి 12 గంటల సమయంలో హాస్టల్‌లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, ఇనుప పైపులు, క్రికెట్ బ్యాట్‌లతో దాడికి దిగింది. ఈ క్రమంలో రెండు వర్గాలుగా విడిపోయిన విద్యార్థులు కళాశాలలో వీరంగం సృష్టించారు. అక్కడే ఉన్న మరి కొంత మంది హుటాహుటిన ప్రిన్సిపాల్ వద్దకు వెళ్లి విషయం చెప్పగా, ఆయన వచ్చి సర్దిచెప్పారు. దాడిలో గాయపడిన వారిని ఎల్లారెడ్డి దవాఖానకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈ వ్యవహారంపై ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్, సీఐ రవీందర్‌నాయక్, జోనల్ అధికారి ఫ్లోరెన్స్ రాణి కళాశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, తప్పు ఎవరు చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.



ఘటన వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

# తండాల్లో చిరుత సంచారం

రుద్రూర్/ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 6: ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో కొన్నిరోజులుగా చిరుతల సంచారం ఆందోళన కలిగిస్తోంది. పల్లెల్లోకి ప్రవేశించి మూగజీవాలను బలితీసుకుంటున్నాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా వర్ని మం డలం అఫంది ఫారం తండా లో గురువారం రాత్రి చిరుత దాడిలో ఓ దూడ మృతి చెందింది. హరిసింగ్‌కు చెందిన పశువుల పాకలోకి చొరబడిన చిరుత, అందులో కట్టేసి ఉంచిన గేదెలు, దూడలపై దాడి చేసి ఓ దూడను హతమార్చింది. శుక్రవారం ఉదయం గమనించిన యజమాని ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాడు. దీంతో వారు అక్కడికి చేరుకొని పరిశీలించి చిరుత దాడి చేసింది వాస్తవమేనని ఫారెస్టు రేంజ్ అధికారి సంజయ్ గౌడ్, బీట్ అధికారి శివ తెలిపారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్‌లో..**

పదిరోజుల క్రితం ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ గ్రామ శివారులోకి చిరుత వచ్చి విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే ప్రాంతంలో చిరుత పాద ముద్రలు కనిపించడంతో తండావాసులు ఆందోళన చెంది, వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ అధికారి బిక్కి మాటిల్, బీట్ అధికారిణి పిచ్చమ్మ, సిబ్బంది జీవన్, హరియా అక్కడికి చేరుకొని చిరుత పాద ముద్రలను పరిశీలించారు. తండావాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**భయం గుప్పిట్లో గ్రామస్తులు**

**అఫంది ఫారంలో చిరుత దాడిలో దూడ మృతి**



హాజీపూర్ గ్రామ శివారులో చిరుత పాదముద్రలు

# నిత్యావసర ధరలను నియంత్రించాలి

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 6: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సుధాకర్, భూమయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈనెల 30 వరకు రేషన్ లబ్ధిదారులు ఈ–కేవైసీ చేసుకోకపోతే రేషన్ కార్డులు రద్దు చేస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. రేషన్ కార్డు ఉన్న కూలీలు, కార్మికులు గ్రామాల్లో పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని, ఈ–కేవైసీకి సమ యం పెంచాలని కోరారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. నాయకులు ఓమయ్య, అడికె రాజేశ్వర్, బి.రఘురాం, నర్సింగ్‌రావు, సాయిలు, అనిల్, రమేశ్, అంజలి, కవిత, సాయి కిరణ్ పాల్గొన్నారు.




నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

# ఇందూరు బిడ్డకే పీసీసీ పీఠం



బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పీసీసీ పీఠం ఇందూరు బిడ్డకే దక్కింది. రాష్ట్ర కాంగ్రెస్ సారథ్య బాధ్యతలను బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కే ఆ పార్టీ అధిష్టానం అప్పగించింది. ఎంతో మంది సీనియర్లు పోటీలో ఉన్నా బీసీ సామాజికవర్గ నాయకుడు, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అయిన మహేశ్‌వైపే ఏఐసీసీ మొగ్గు చూపింది. దీంతో ఎన్నో రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెర పడింది. విద్యార్థి నాయకుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన మహేశ్ కుమార్ గౌడ్ స్వస్థలం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని రహత్ నగర్ గ్రామం. ఆయనకు భార్య సంధ్యారాణి, ఇద్దరు కుమారులు రుత్విక్‌గౌడ్, ప్రణవ్‌గౌడ్ ఉన్నారు. 20 ఏండ్లకే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఆయన 40 ఏండ్లుగా పార్టీలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. 1994లో డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి, 2014లో నిజామాబాద్‌అర్బన్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. విద్యాధికుడైన మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ ఏడాది జనవరిలోనే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు ఐదు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

# నిజాంసాగర్‌కు పెరిగిన వరద

నిజాంసాగర్, సెప్టెంబర్ 6: నిజాంసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అయిన సింగూర్ ప్రాజెక్టు నుంచి రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల విడుదల చేయడంతో ఇన్‌ఫ్లో ఒక్కసారిగా 30వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి శుక్రవారం ఐదు గేట్ల ద్వారా 36,500 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేసున్నట్లు ఇరిగేషన్ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగులకు (17. 802 టీఎంసీలు) 1404.64 అడుగుల (17.282 టీఎంసీలు) నీటి నిల్వ ఉందని ఆయన వివరించారు.

**ఎస్సారెస్పీలోకి 50,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

మోర్తాడ్, సెప్టెంబర్ 6: మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. శుక్రవారం ప్రాజెక్ట్‌లోకి 50,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థా యి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, శుక్రవారం సాయంత్రం 1090 అడుగుల (76. 894 టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. 5,882 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది.